క్లుప్తంగా

కనుల పండువగా ఊంజల్ సేవ


ఉయ్యాల సేవలో అమ్మవారు

నారాయణవనం: మండల కేంద్రంలో టీటీడీ అనుబంధ ప్రసిద్ధ శ్రీపద్మావతీ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం సాయంత్రం ఉయ్యాల సేవలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 7 గంటలకు శ్రీవేంకటేశ్వరస్వామికి, 8 గంటలకు శ్రీపద్మా వతీ అమ్మవారికి శుక్రవార అభిషేకాలను పూర్తి చేశారు. శ్రీవేంకటేశ్వరస్వామి జన్మనక్షత్రమైన శ్రవణం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అర్చనలు చేసి, నైవేద్యాలను సమర్పించారు. సాయంత్రం నిత్యకైంకర్యాల అనంతరం శ్రీపద్మావతీ అమ్మవారిని సుందరంగా అలంకరించి తిరుచ్చి వాహనంపై కొలువుదీర్చి పూజలు చేశారు. తదుపరి అంతర ప్రాకారంలో ఊరేగింపుగా తీసుకువెళ్లి ఊంజల్ మండపంలో ఉయ్యాలలో కొలువుదీర్చి ఊంజల్ సేవ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని వీక్షించి తరించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వైభవంగా కుంభాభిషేకం


ఊంజల్ సేవలో అమ్మవారు

పిచ్చాటూరు: మండలంలోని రామగిరిలో గ్రామ దేవత శ్రీ అంకాళపరమేశ్వరి ఆలయ కుంభాభిషేకం శుక్రవారం భక్తిప్రపత్తులతో నిర్వహించారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేక పూజలు చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం శ్రీఅంకాళపరమేశ్వరి ఉత్సవమూర్తిని విశేషంగా అలంకరించి ఊయలపై కొలువుదీర్చి ఊంజల్ సేవ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి సేవలో తరించారు. తీర్థ ప్రసాదాలు అందించారు.

కేంద్ర పోలీసు బలగాల కవాతు


కవాతులో డీఎస్పీ శ్రీనివాసరావు

సత్యవేడు: పట్టణంలోని రానున్న సార్వత్రిక ఎన్నికల సందర్భంగా శుక్రవారం పోలీసు కవాతు నిర్వహించారు. డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కేంద్ర పోలీసు బలగాలతో కవాతు నిర్వహించారు. ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు, ప్రజల భద్రతకు భరోసా కల్పించడంతలో భాగంగా ఫ్లాగ్ మార్చ్ నిర్వహించినట్లు డీఎస్పీ తెలిపారు. సీఐ దివాకర్ రెడ్డి, ఎస్ఐ వీరాంజనేయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వాలీశ్వరస్వామి సేవలో రాజేష్


వాలీశ్వరస్వామిని దర్శించుకుంటున్న రాజేష్

వరదయ్యపాళెం : సంతవేలూరు శ్రీకామాక్షి సమేత వాలీశ్వరస్వామి ఆలయాన్ని వైఎస్సార్ సీపీ సత్యవేడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నూకతోటి రాజేష్ దంపతులు సందర్శించారు. ఆయన వెంట పార్టీ తిరుపతి జిల్లా సోషల్ మీడియా కో-కన్వీనర్ వేలూరు రాకేష్, మండల కన్వీనర్ నాయుడు దయాకర్ రెడ్డి, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు దామోదర్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ హరిబాబురెడ్డి తదితరులు ఉన్నారు.

కల్కి భగవాన్ పిటిషన్ కొట్టివేతపై హర్షం

తిరుపతి కల్చరల్: కల్కి భగవాన్ పిటిషన్‌ను కోర్టు కొట్టివేయడాన్ని స్వాగతిస్తున్నామని ఏపీ హేతువాద సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నార్ని వెంకటసుబ్బయ్య తెలిపారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. కల్కి భగవాన్ పేరుతో విజయకుమార్ ప్రభుత్వ భూములు, వందలాది ఎకరాల డీకేటీ భూములు, అటవీశాఖ భూములను ఆక్రమించి వరదయ్యపాలెం వద్ద ఆశ్రమాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. దీనికి వ్యతిరేకగంగా కల్కి భగవాన్ పిటిషన్‌ను గత జనవరి 10వ తేదీన కొట్టి వేసి ఆశ్రమ యాజమ్యాన్ని ప్రాసిక్యూట్ చేయాలని తీర్పు చెప్పడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. కోర్టు తీర్పు ఇచ్చి రెండు నెలలు గడుస్తున్నా ప్రభుత్వ అధికారులు ఆశ్రమ భూమిని స్వాధీనం చేసుకోకపోవడం సమంజసం కాదన్నారు. ఆశ్రమాల పేరుతో దొంగ బాబాలు పుట్టుకొస్తూ, దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. జిల్లా కలెక్టర్ తక్షణం స్పందించి ఆశ్రమ యాజమాన్యాన్ని ప్రాసిక్యూట్ చేసి, ఆశ్రమ భూములను స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. ఏపీ హేతువాద సంఘం ప్రతినిధులు డి.కోటేశ్వరరావు, రాంమూర్తిరెడ్డి పాల్గొన్నారు.

ముక్కంటి..నిన్నే శరణంటి

ఇల కైలాసం శ్రీకాళహస్తీశ్వర క్షేత్రం భక్తజన సంద్రంగా మారింది. మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా భక్తులు పోటెత్తారు. శ్రీకాళహస్తీశ్వరుడిని దర్శించి భక్తులు దివ్యానుభూతిని పొందారు. అడుగడుగునా ఆలయంలో ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడింది. శంభోశంకర.. హరహర మహదేవ అంటూ భక్తి పారవశ్యంలో మునిగితేలారు. ఉదయం రథోత్సవం, రాత్రి నంది సేవను తిలకించేందుకు వచ్చిన భక్తకోటితో ఆలయ వీధులు కిక్కిరిశాయి. ఆలయం, పరిసరాలు భక్తజనంతో సందడిగా మారాయి. వాహన సేవల ముందు కళాప్రదర్శనలు నేత్రానందం కలిగించాయి.

– శ్రీకాళహస్తి


రథోత్సవంలో అశేష భక్తకోటి


యాగశాల పూజల్లో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి దంపతులు


ఓం నమఃశివాయ: ఆలయంలో భక్తుల రద్దీ




వాహన సేవ ముందు కళా రూపాల సందడి


శంభో శంకర: ఆలయంలో క్యూలో వెళుతున్న భక్తులు

భక్తుల సేవలో మేము సైతం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివరాత్రి వేడుకలను పురస్కరించుకుని శుక్రవారం భక్తులకు పలువురు అన్నదానం చేశారు. ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ మిద్దెల హరి భక్తులకు, ప్రయాణికులకు మజ్జిగ, మంచినీటి సౌకర్యం కల్పించారు. ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన అన్నదాన కార్యక్రమంలో చెవిరెడ్డి మధుసూదన్ రెడ్డి, చిలకా రంగయ్య, చంద్రశేఖర్, విద్యాసాగర్, డిల్లీబాబు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. సరస్వతి శిశుమందిర్ ఆధ్వర్యంలో జరిగిన అన్నదాన కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. యంగ్ ఎంప్లాయిస్ ఆధ్వర్యంలో జరిగిన అన్నదాన కార్యక్రమంలో హేమకుమార్, సాయికుమార్, షరీఫ్, ముఖేష్, శ్రీనివాసులు, నారాయణ, సురేష్, ప్రదీప్, కుమార్, మునస్వామి, శివ తదితరులు పాల్గొన్నారు. ఎల్ఐసీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కులసంఘాల నాయకులు, పూర్వవిద్యార్థులు, వ్యాపారులు పాల్గొన్నారు.


అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మిద్దెల హరి

భక్తిగీతాలు ఆలపిస్తున్న నేపథ్య గాయకులు శ్రీకృష్ణ,హరిణి





స్వరరాగ గంగా తరంగమే..

శ్రీకాళహస్తీశ్వర స్వామివారి బ్రహోత్సవాల్లో భాగంగా మహా శివరాత్రి సందర్భంగా శుక్రవారం ధూర్జటి కళాప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఓలలాడించాయి. సినీ గాయకులు హరిణి, శ్రీకృష్ణ ఆలపించిన గీతాలు భక్తి సాగరంలో ముంచెత్తాయి. కళాకారిణుల నృత్యప్రదర్శనలు రంజింపజేశాయి. – శ్రీకాళహస్తి






భద్రకాళి నృత్య రూపకం, శ్రీకాళహస్తికి చెందిన మనస్విని భరతనాట్యం, హైదరాబాదు సంపద బృందం కూచిపూడి నృత్యం


శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో శ్రీకాళహస్తి చిన్నారుల నృత్యప్రదర్శన

సురుటుపల్లెలో వైభవంగా నందిసేవ


నంది వాహనంపై స్వామివారు


పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న టీటీడీ అధికారులు

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లి శ్రీపల్లి కొండేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం మహా శివరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల రద్దీ కనిపించింది. శివనామ స్మరణతో ఆలయం మార్మోగింది. ఉదయం ఆలయంలో ప్రత్యేక అభిషేక పూజలు, అలంకరణలు జరిగాయి. ఆలయ చైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి తాగునీటి వసతి, ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆలయంలో పుష్ప, విద్యుద్దీపాలంకరణలు ఆకట్టుకున్నాయి. లోకా ఫౌండేషన్ ఉదయం నుంచి రాత్రి వరకు వివిధ రకాల ప్రసాదాలు పంపిణీ చేసింది. ఉదయం, రాత్రి అన్నదానం చేశారు. రాత్రి సర్వాలంకార భూషితులైన శ్రీస్వామి,అమ్మవార్లను నంది వాహనంపై కొలువుదీర్చి మహా హారతులు చేపట్టారు. అనంతరం మేళతాళాలు, మంగళవాయిద్యాలు, కోలాట నృత్యాల నడుమ తిరువీధుల్లో ఊరేగింపు నయనానందకరంగా సాగింది.

పట్టు వస్త్రాలు సమర్పించిన టీటీడీ

మహాశివరాత్రి సందర్భంగా శుక్రవారం టీటీటీ తరఫున సూపరింటెండెంట్ ఉమామహేశ్వర్ రెడ్డి, అధికారులు శ్రీనివాసులు, మధు సూదన్‌రెడ్డి పట్టు వస్త్రాలను సమర్పించారు. ఆలయ చైర్మన్ బాలాజీ రెడ్డి ఆధ్వర్యంలో స్వాగతం పలికారు.

భవహరణా..శుభ చరణా


వరదయ్యపాళెం: సంతవేలూరు వాలీశ్వరస్వామి ఆలయంలో ..


రామగిరి ఆలయం వద్ద భక్తుల సందడి

పిచ్చాటూరు: మండలంలోని రామగిరిలో ప్రసిద్ధ శ్రీమరగదాంబిగ సమేత వాలీశ్వరాలయం శివరాత్రిని పురస్కరించుకుని శుక్రవారం భక్తులతో పోటెత్తింది. ఉదయం మాజీ ఎమ్మెల్సీ కె.జయచంద్ర నాయుడు కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించి స్వామివారికి ప్రత్యేక అభిషేక పూజలు చేశారు. అనంతరం సుందరాంగంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం విశేషంగా అలంకరించిన శివపార్వతుల ఉత్సవమూర్తులను నంది వాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు ఆలయానికి పోటెత్తారు. ఈ ఉత్సవానికి ఉభయకర్తలుగా వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఏవీఎం బాలాజీ రెడ్డి, కుటుంబసభ్యులు వ్యవహరించారు. ఏర్పాట్లను పాలక మండలి చైర్మన్ సురేష్, ఈఓ లత, సర్పంచ్ సతీష్, ఎంపీటీసీ సభ్యుడు శోభన్ బాబు పర్యవేక్షించారు. ఎస్ఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.


ఏర్పేడు: మర్రిమంద ఆలయంలో..

బుచ్చినాయుడుకండ్రిగ మండలంలో..

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని గాజుల పెళ్లూరు, కాంపాళెం, పెద్దపాలేడు, గ్రామాల్లోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయాల్లో ఉదయం అభిషేక పూజలు, అలంకరణలు జరిగాయి. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

నారాయణవనం మండలంలో..

నారాయణవనం: ప్రఖ్యాత పర్యాటక కేంద్రమైన కైలాసనాథకోన జలపాతంలో భక్తులు పవిత్రస్నానాలు ఆచరించి శ్రీకామాక్షాంబిక సమేత కైలాసనాథస్వామిని దర్శించుకున్నారు. వేకువ జామున 4 గంటలకే టీటీడీ ఆలయాలైన చంపకవల్లీ సమేత పరాశురేశ్వర, మరగదవల్లీ సమేత అగస్తీశ్వరస్వామి ఆలయాలతో పాటు కైలాసకోనలోని ఆలయాన్ని తెరచిన అర్చకులు మూలవర్లకు అభిషేకాలను నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. అన్నప్రసాదాలను అందజేశారు. వైఎస్సార్ సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయ కర్త నూకతోటి రాజేష్ కుటుంబ సభ్యులతో కలిసి కైలాసనాథస్వామిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో కృష్ణనాయక్, చైర్మన్ సుబ్రమణ్యం యాదవ్ స్వాగతం పలికి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

రేణిగుంట మండలంలో..

రేణిగుంట: మండలంలోని గాజులమండ్యంలో వెలసిన శ్రీకామాక్షిదేవి సమేత మూలస్థానేశ్వరాలయంలో ఉదయం అభిషేక పూజలతో ప్రారంభమైన శివరాత్రి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. స్వామి,అమ్మవార్ల దర్శనార్థం భక్తులు పెద్దసంఖ్యలో క్యూకట్టారు. ఆలయ నిర్వాహకులు జువ్వల ధనంజయరెడ్డి ఆధ్వర్యంలో విశేష పుష్పాలంకరణ చేశారు. భక్తులకు అన్నదానం చేశారు.

చింతకోనేశ్వరసామి ఆలయంలో...

మండలంలోని కరకంబాడిలో వెలసిన శ్రీచింతకోనేశ్వరస్వామి ఆలయంలో మహా శివరాత్రిని పురస్కరించుకుని తెల్లవారుజామున 3గంటలకు రుద్రాభిషేకం నిర్వహించి స్వామివారిని విశేషంగా అలంకరించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. వెదుళ్లచెరువులో వెలసిన ఓంకార జ్యోతిర్లింగేశ్వరాలయంలో విశేష అభిషేక పూజలు చేశారు. గుండాల గోపినాథ్‌రెడ్డి సారె సమర్పించి భక్తులకు అన్నదానం చేశారు.

మార్మోగిన శివనామస్మరణలు

ఏర్పేడు: మండలంలోని గుడిమల్లం పరశురామేశ్వరస్వామి, రావిళ్లవారికండ్రిగ ఎరికలింగేశ్వర స్వామి, చిందేపల్లి పార్వతీ సమేత సిద్దేశ్వర స్వామి, మర్రిమంద శివాలయం, అంజిమేడు గురప్ప స్వామి, కందాడు సదాశివేశ్వర స్వామి, పాపానాయుడుపేట బ్రమరాంబికా మల్లికార్జున స్వామి, చెల్లూరు శివాలయం, ఏర్పేడు కాశీవిశ్వేశ్వర స్వామి, నాగంపల్లి నందీశ్వర స్వామి తదితర ఆలయాల్లో విశేష పూజలు జరిగాయి. మధ్యాహ్నం అన్నదానాలు చేశారు. గుడిమల్లం పరశురామేశ్వర స్వామి ఆలయలో చైర్మన్ నరసింహయాదవ్, ఈఓ రామచంద్రారెడ్డి, చిందేపల్లి సిద్దేశ్వర స్వామి ఆలయ ధర్మకర్త గిరిధర్ రెడ్డి ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలు జరుతున్నాయి.

సదాశివేశ్వర స్వామి ఆలయంలో నాగుపాము

కందాడు సదాశివేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం నాగుపాము హల్‌చెల్ చేసింది. మహాశివరాత్రి పర్వదినాన నాగుపాము కనబడంతో భక్తులు నాగదేవత అంటూ ప్రార్థనలు చేశారు. తరువాత పాము పొదల్లోకి వెళ్లిపోయింది.

శివనామ స్మరణతో హోరెత్తిన ఆలయాలు

వరదయ్యపాళెం: మండలంలోని శ్రీజ్యోతీశ్వరాలయం, అరుదూరులోని శ్రీకాళహస్తీశ్వర సమేత శ్రీ జ్ఞానప్రసూనాంబికా దేవి ఆలయం, వరదయ్యపాళెంలోని త్రయంబకేశ్వరాలయం, వెంకటరెడ్డి కండ్రిగలోని ఉమామహేశ్వర ఆలయం, సంతవేలూరులోని శ్రీకామాక్షిదేవి సమేత వాలీశ్వర స్వామి ఆలయం, ఉబ్బలమడుగులోని సిద్ధేశ్వరాలయం భక్తులతో కిటకిటలాడాయి. త్రయంబకేశ్వరాలయంలో పుష్పాలం కరణలు ఆకట్టుకున్నాయి. ఉబ్బలమడుగులోని సిద్ధేశ్వరాలయంలో ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. దేవాంగ సంక్షేమ సంఘం డైరెక్టర్ బొప్పన తిలక్‌బాబు ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. సంతవేలూరులోని శ్రీకామాక్షిదేవి సమేత వాలీశ్వర స్వామి ఆలయంలో వైభవోపేతంగా వేడుకలు జరిగాయి.


రేణిగుంట : కరకంబాడి చింతకోనేశ్వరాలయంలో ..


గాజులమండ్యం మూలస్థానేశ్వరస్వామి


శ్రీకాళహస్తి అర్ధనారీశ్వరస్వామి ఆలయంలో..

అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలు

కేవీబీపురం: అన్ని రంగాల్లో మహిళలు పురుషులకు దీటుగా రాణిస్తున్నారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గవర్లకృష్ణయ్య పేర్కొన్నారు. శుక్రవారం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పార్టీ మండల కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు బొర్రా మాధవీరెడ్డి ఆధ్వర్యంలో మహిళా అధికారులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ మహిళలు గడప దాటకూడదనే కాలం నుంచి గగనంలోకి ప్రయాణించే స్థాయికి ఎదిగారని అన్నారు. తల్లిగా, చెల్లిగా, భార్యగా మన జీవితంలొ భాగమవడమే కాకుండా, ఉద్యోగాల్లో రాణిస్తున్నారని తెలిపారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ఏర్పేడు: మండలంలోని కందాడులో మహదేవరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం చలివేంద్రం ప్రారంభ మైంది. ఎండాకాలం ప్రవేశిస్తుడండంతో పాదచారులకు ఎండ, వేడిమి ఉపశమనం కోసం చలివేంద్రం ఏర్పాటు చేశారు. తొలి రోజు మజ్జిగ అందశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పారి నాగరాజు, లోకయ్య, రఘు, సుబ్రమణ్యం, మునిరత్నం , నరేష్, ప్రకాష్ పాల్గొన్నారు.